

ఉష్ణోగ్రతలు | గరిష్టం : 28.0 | కనిష్టం : 23.0

విద్యుదాఘాతంతో రైతు మృతి



సామ నిరంజన్ (ఫైల్)

తెలకపల్లి, సెప్టెంబరు 22: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కార్వంగకు చెందిన సామ నిరంజన్(55) గ్రామంలోని గుండేటి కుంట వద్ద గల తన మిరప తోటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. పొలంలో కింద పడిన విద్యుత్ వైరును కుడి చేతితో తీస్తుండగా, విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిరంజన్ భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టెండర్ దశలో.. పేట-కొడంగల్ ఎత్తిపోతల

- పథకం పూర్తయితే లక్షా 10 వేల ఎకరాలకు అందనున్న నీరు
- 60 ఏళ్ల కల సాకారం దిశగా ప్రభుత్వం అడుగులు
- రూ.2,878 కోట్ల నిధులు మంజూరు
- వారం రోజుల్లో ఓపెన్ చేయనున్న టెండర్లు

కోస్గి, సెప్టెంబరు 22: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండరు దశలో ఉంది. ఈ పథకం పూర్తయితే నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో వలసలు ఆగి, భూములు సస్యశ్యామలం కానున్నాయి. గతంలో జీవో 69 ద్వారా ఇక్కడి భూములకు కృష్ణా జలాలు ఇవ్వాలని ఎంతోమంది రైతులు చలో అసెంబ్లీ, ధర్నాలు రాస్తారోకో, ఎడ్ల బండ్లతో నిరసనలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈప్రాంత ప్రజలను ఓటుబ్యాంకుగా వాడుకున్నారు తప్ప.. నీరందించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పథకం అమలుకు మార్గం సుగమం అయ్యింది.

రెండు ఫేజ్‌లుగా పనులు

రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలోని 7.10 టీఎంసీల మిగులు జలాలను నాలుగు స్టేజీల ద్వారా 230 మీటర్లు ఎత్తిపోసేందుకు జీవో 14ను ఈ ఏడాది ఫిబ్రవరి ఎనిమిదిన ప్రభుత్వం తెచ్చింది. వెంటనే ముఖ్యమంత్రి రూ.2,878 కోట్ల నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన చేశారు. ఇప్పటికే పథకం సర్వే పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనులను ఫేజ్ 1, ఫేజ్ 2గా విభజించారు. మొత్తం లక్షా 10 వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా పనులు ప్రారంభం అయ్యాయి. సాగు అంచనా పెరిగే అవకాశం కూడా ఉంది.



నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనులకు సర్వే చేస్తున్న సిబ్బంది(ఫైల్)

ఫేజ్ 1 పనులకు టెండరు ప్రక్రియ ఈనెల 13న ముగిసింది. ఈటెండర్ ప్రక్రియ ప్రస్తుతం సీవోటీ(సర్వే ఆఫ్ టెండరు) దగ్గర ఉంది. అక్కడ ప్రకియ పూర్తి అయిన వెంటనే పనులను కేటాయించనున్నారు. వారంలో టెండరు ఓపెన్ చేయనున్నట్లు ఇరిగేషన్ ఈఈ బ్రహ్మానందం తెలిపారు.

అంచనా వ్యయం పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

ఫేజ్ 1 ఇలా..

ఫేజ్ 1లో పనులను మూడు లిఫ్టులుగా విభజించి, చేపడతారు. లిఫ్ట్ 1లో భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఉట్కూర్ చెరువుకు ఎత్తిపోస్తారు. అందుకోసం 18.9 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ వేస్తారు. పైప్‌లైన్ వెడల్పు మూడు మీటర్లు(డయామీటర్ మెజర్‌మెన్) ఉంటుంది. లిఫ్ట్ 2లో ఉట్కూర్ చెరువు నుంచి జాయమ్మ చెరువుకు నీటిని ఎత్తిపోస్తారు. ఇక్కడ 12 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ ఉంటుంది. లిఫ్ట్ 3లో జాయమ్మ చెరువు నుంచి కానుకుర్తి చెరువుకు నీటిని ఎత్తిపోస్తారు. అందుకోసం తొమ్మిది కిలో మీటర్ల మేర పైప్‌లైన్ వేయనున్నారు.

మండలాల వారీగా సాగు భూమి వివరాలు

పథకం కింద ఫేజ్ 1లో మక్తల్ నియోజకవర్గంలోని ఉట్కూర్ మండలంలో 19,625 ఎకరాలకు నీరందనుంది. మక్తల్ మండలంలో 61,58 ఎకరాలకు, నారాయణపేటలో 9,135, ధన్వాడలో 1,197, దామరగిద్దలో 10,141 ఎకరాలకు నీరందనుంది.

ఫేజ్ 2 చేపడితే..

ఫేజ్ 1 పూర్తయ్యాక ఫేజ్ 2 పనులు చేపడతారు. ఈ పనులు పూర్తయితే కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలంలో 10,528 ఎకరాలకు నీరందనుంది. కోస్గి మండలంలో 14,642 ఎకరాలకు, మద్దూరులో 17,558, కొడంగల్‌లో 4,085, బొంరాస్‌పేట మండలంలో 6,932 ఎకరాలకు నీరు అందించనున్నారు. పథకం అమలైతే నారాయణపేట, కొడంగల్‌లలో భూములు సస్యశ్యామలమై వలసలు ఆగుతాయి.



భూత్పూర్ రిజర్వాయర్(ఫైల్)

స్త్రీనిధితో ఆర్థికాభివృద్ధి

- నెల నెలా జమ చేసుకున్న డబ్బులను రుణంగా ఇస్తున్న బ్యాంకులు
- వాటి ద్వారా వ్యాపారాలు చేస్తున్న మహిళలు
- కుటుంబ పోషణకు ఆసరా.. సమాజంలో గౌరవం



ఖిల్లాఘణపురంలో స్త్రీ నిధి రుణం ద్వారా కిరాణం దుకాణం నిర్వహిస్తున్న మహిళ

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి రుణంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా రుణాలు చెల్లిస్తుండటంతో వారికి లోన్లు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. ఈ పథకం కింద సంఘాల్లోని మహిళలు స్త్రీ నిధిలో సభ్యత్వం పొందడంతో పాటు ఒక్కో మహిళా సంఘం రూ.7,200 పెట్టుబని పొదుపు చేసేవారు. ప్రస్తుతం రూ.14,400 బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. ఆ పెట్టుబడిని ఏడు సంవత్సరాల తరువాత బ్యాంకులు ఆయా సంఘాలకు రుణాలుగా చెల్లిస్తున్నాయి. ఆ డబ్బులతో వ్యాపారాలు నిర్వహిస్తూ, వనపర్తి జిల్లాలోని మహిళలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

49,331 మంది సభ్యులు

వనపర్తి జిల్లాలో 5,635 మహిళా సంఘాలు స్త్రీ నిధిలో సభ్యత్వం పొందాయి. వాటిలో 49,331 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 229 సంఘాల్లోని 629 మంది మహిళలకు రూ.ఐదు కోట్లా 81 లక్షలు రుణాలుగా ఇచ్చారు. అర్హత ఉన్న గ్రామ సంఘాలకు రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణం యూనిట్ స్థాయిని బట్టి రూ.25 వేల నుంచి రూ.మూడు లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు.

నాలుగు విధాలుగా అందజేత

స్త్రీ నిధి రుణాలను నాలుగు విధాలుగా అందిస్తున్నారు.

- సువిధ రుణం కింద రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ఇస్తారు. డబ్బులు తిరిగి చెల్లించేందుకు 24 నెలలు కాల పరిమితి ఉంటుంది.
- ప్రగతి రుణం కింద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తారు. కాలపరిమితి వ్యవధి 42 నుంచి 48 నెలలు ఉంటుంది.
- అక్షయ రుణం కింద రూ.లక్ష ఇస్తారు. డబ్బులు తిరిగి చెల్లించేందుకు కాలపరిమితి వ్యవధి 60 నెలలు ఉంటుంది.
- సౌభాగ్య రుణం కింద రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు చెల్లిస్తారు. కాల పరిమితి వ్యవధి 60 నెలలు ఉంటుంది.

వ్యక్తిగతంగానూ అందజేత

స్త్రీ శక్తి రుణాలు ప్రత్యేక స్కీములుగా వ్యక్తిగతంగానూ మంజూరు చేస్తున్నారు. ఈ రుణం పొందే మహిళలు కిరాణం, దుస్తులు, సెంట్రింగ్, కూరగాయలు, లేడీస్ కార్నర్, హోటల్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి వ్యాపారాలు నిర్వహిస్తూ సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్నారు. వ్యవసాయానికి పెట్టుబడిగానూ వాడుకుంటున్నారు. స్పెషల్ స్కీం ద్వారా గేదెలు, ఆవులను కొనుగోలు చేసి పశు పోషణతో లబ్ధి పొందుతున్నారు. మహిళా రైతులకు వ్యవసాయ వినియోగానికి ట్రాక్టర్లు, స్వశక్తితో జీవించే వారికి పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఎలక్ట్రిక్ ఆటోలు, అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనాలు అందిస్తున్నారు. మదర్ యూనిట్ ద్వారా గృహిణుల ఆర్థిక అభివృద్ధి కోసం నాటు, జాతి కోళ్ల పెంపకానికి రుణాలు ఇస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా రుణాలు చెల్లిస్తుండటంతో వారికి రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు మొగ్గుచూపుతున్నాయి. ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, ప్రోత్సాహకాలు పెంచాలని మహిళలు కోరుతున్నారు.



ఖిల్లాఘణపురంలో జనరల్ స్టోర్ ద్వారా ఉపాధి పొందుతున్న ఫాతిమా మహిళా సంఘం సభ్యురాలు హసీనా బేగం

కుటుంబానికి ఆసరాగా ఉంది



సంవత్సరం క్రితం స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకుని కిరాణం వ్యాపారం నిర్వహిస్తున్నా. దుకాణం ద్వారా ఉపాధి పొందడంతో కుటుంబానికి ఆసరాగా ఉంది. రుణం డబ్బులు నెల నెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా. మహిళలకు మరింత ప్రోత్సాహం అందిస్తే స్వయం ఉపాధితో ఉన్నతంగా జీవిస్తారు. గ్రామాల్లోని మహిళలకు రుణాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

- కవిత, లక్ష్మీ నరసింహ కిరాణం, ఖిల్లాఘణపురం

సద్వినియోగం చేసుకోవాలి



స్త్రీ నిధి రుణ ప్రక్రియ అంతా గ్రామ సమాఖ్య స్థాయిలో జరిగేలా చూస్తున్నాం. మహిళలు పొదుపు చేసుకున్న డబ్బును వారికే రుణంగా అందించి, జీవనోపాధి కల్పిస్తున్నాం. వివిధ వ్యాపారాల్లో అభివృద్ధి సాధించడానికి అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. రుణాలు పొందిన మహిళలు సకాలంలో వాయిదాలు చెల్లించి, మహిళా శక్తిని పెంపొందించడానికి సహకరించాలి

- ఉమాదేవి, డీఆర్‌డీవో, వనపర్తి

మహిళలకు అవగాహన పెంచాలి



స్త్రీ నిధి రుణాలపై మహిళలకు అవగాహన పెంచాలి. గ్రామీణ ప్రాంత మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని, జీవనోపాధి పొందుతున్నారు. సంఘం సభ్యులు స్త్రీ నిధిలో పెట్టుబడులు పెంచుతూ, రుణాలను సకాలంలో చెల్లిస్తే మరింత మంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది. ఇల్లాలే ఇంటికి దీపమని మరువకుండా మహిళా లోకం చైతన్యం పొందాలి.

- భాగ్యమ్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

రుణాలు సకాలంలో చెల్లిస్తే మరింత ప్రయోజనం



స్త్రీ నిధి రుణాలు పొందిన మహిళలు నెలనెలా వాయిదాలు చెల్లిస్తే మరింత మంది మహిళలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్త్రీ నిధి ద్వారా మహిళలకు రూ.ఐదు కోట్లా 81 లక్షల రుణాలను అందించాం. ఈ రుణాలు మహిళల జీవనోపాధికి మద్దతుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం మహిళలకు ప్రోత్సహకాలు అందించడానికి సిద్ధంగా ఉంది.

- ఆనందరావు, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్, వనపర్తి

క్రీడలకు ప్రాధాన్యం

- బడ్జెట్‌లో రూ.364 కోట్లు కేటాయింపు
- గత సర్కార్ ఆటలను నిర్లక్ష్యం చేసింది
- మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ అకాడమీని త్వరలో ప్రారంభిస్తాం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఏకగ్రీవ ఎన్నిక



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తోందని, అందులో భాగంగా బడ్జెట్‌లో రూ.364 కోట్లు కేటాయించిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ క్రీడలను నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. సీఎం ఫుట్‌బాల్ క్రీడాకారుడు కాబట్టి క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని, నెలకొల్పి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించేందు కృషి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని క్రీడా పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని, ప్రతీ పార్లమెంట్ పరిధిలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. అక్టోబరు రెండు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ నిర్వహించి.. మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి రావడంలో క్రీడా సంఘాలు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్రహిస్తామని తెలిపారు. ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, అందరి సూచనలు, సలహాలు తీసుకొని క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. క్రీడలకు పూర్వ వైభవం తేస్తామన్నారు. జిల్లా స్టేడియంలో వాలీబాల్ అకాడమని త్వరలో ప్రారంభిస్తామని, రేపే ఆదేశాలు జారీ చేస్తామని జితేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడలకు పూర్వ వైభవం తేవడానికి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు.

కమిటీ ఏకగ్రీవం

అనంతరం ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర పరిశీలకుడు సతీశ్‌గౌడ్ ప్రకటించారు. చైర్మన్‌గా ఏపీ జితేందర్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, కోశాధికారిగా ఉమామహేశ్వరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జాకీర్, దామోదర్‌రెడ్డి, రంగారావు, విలియం, జగన్‌మోహన్‌గౌడ్, నరసింహ, రజనికాంత్‌రెడ్డి,సంయుక్త కార్యదర్శులుగా నర్సింహ, పవన్‌కుమార్, సోహెల్, శరత్‌చంద్ర, బాబులాల్ నాయక్, సాధత్‌ఖాన్‌తో పాటు 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రాథోడ్, అమరేందర్‌రాజు, శ్యామ్‌సుందర్‌గౌడ్, చెన్నవీరయ్య, ముత్యం, శరత్‌చంద్ర, రమణ, తఖీ, వేణు, వడెన్న, మార్టిన్, ఖాజఖాన్, రమేష్‌బాబు, సునీల్, ఆనంద్ పాల్గొన్నారు.

మూడు యూనిట్ల ద్వారానే జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, సెప్టెంబరు 22: వరద ఉధృతి తగ్గడంతో జూరాల ఎగువ, దిగువ కేంద్రాల్లో మూడు యూనిట్లకే విద్యుత్ ఉత్పత్తి పరిమితమైంది. ఎగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో గడిచిన 24 గంటల్లో రెండు యూనిట్ల ద్వారా 1.377 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, దిగువ ఉత్పత్తి కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా 1.668 యూనిట్ల విద్యుత్‌నే ఉత్పత్తి చేశారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఎగువ జల విద్యుత్ కేంద్రంలో 157.096 మిలియన్ యూనిట్లు, దిగువ జల విద్యుత్ కేంద్రంలో 160.754 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే ఉత్పత్తి మరింత తగ్గే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఏచూరిని కోల్పోవడం బాధాకరం

- సంస్మరణ సభలో ప్రజానాట్య/ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 22: దేశంలో మత ఉన్మాదం పెరుగుతున్న తరుణంలో కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరిని కోల్పోవడం బాధాకరమని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఉన్మాదంపై పోరాటం చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని చెప్పారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రపంచ కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి అని అన్నారు. సీతారాం తెలుగు కుటుంబంలో జన్మించారన్నారు. 1984లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీలోకి వెళ్లిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారన్నారు. 2021 కోజికోడ్‌లో నిర్వహించిన మహాసభలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్, వెంకట్ రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు, డాక్టర్ మురళీధర్, టీజేఏసీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాష, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

- ఆరుగురికి గాయాలు
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ వద్ద ఘటన



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

భూత్పూర్, సెప్టెంబరు 22: ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ వద్ద ఆదివారం సాయంత్రం 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వీరశేఖర్, అతని భార్య లీలామాధురి, కూతురు లేఖ్య బీచుపల్లి వద్ద కృష్ణానదిలో పిండ ప్రదానం చేసేందుకు ఆదివారం ఉదయం వెళ్లారు. కార్యక్రమాలు ముగించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. భూత్పూర్ పోలీస్ స్టేషన్ వద్ద సర్వీస్ రోడ్డు పక్కన కారును ఆపి, కొద్దిసేపు విరామం తీసుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన మరో కారులో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌కు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్న వారు ఆగి ఉన్న కారును ఢీకొట్టారు. దాంతో అందులో ప్రయాణిస్తున్న నాగ రవీందర్, నాగ ప్రసాద్, లక్ష్మీనర్సమ్మ, ముందున్న కారులోని వీర శేఖర్, లీలామాధురి, లేఖ్యలకు స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా రెండు కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎస్‌ఐ చంద్రశేఖర్ ఘటనా స్థలిని పరిశీలించారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



నిధుల్లేక నీరసం

- పంచాయతీలకు నిధుల కొరత

- ప్రబలుతున్న విష జ్వరాలు

- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

మదనాపురం, సెప్టెంబరు 22: పల్లెలు నిధులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వనపర్తి జిల్లాలోని 255 పంచాయతీలలో 96 మందిని ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. వీరికి రెండు లేదా మూడు గ్రామాలను కేటాయించింది. గ్రామంలో ఏదైనా పని చేయాలంటే పంచాయతీలలో డబ్బులు లేకపోవడంతో దిక్కు తోచనిస్థితిలో ఉన్నారు. రాష్ట్ర, కేంద్ర నిధులు కూడా కొన్ని నెలలుగా జమ చేయకపోవడంతో గ్రామాలలో తీవ్ర కష్టాలు మొదలవుతున్నాయి. ఒక్కో పంచాయతీ పరిధిలో పారిశుధ్య సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో పనులు సక్రమంగా చేయక గ్రామాలు అపరిశుభ్రంగా మారాయి. దీని వలన దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు వస్తున్నాయి. గ్రామంలో ఏ ఇంటిలో ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. కనీసం దోమల నియంత్రణకు ఫాగింగ్ కూడా చేయడం లేదు. పేరుకు మాత్రం ప్రత్యేక అధికారులుగా గ్రామాలలో నియమించి నిధులు లేకపోతే మేమేలా పని చేస్తామని కొందరు అంటున్నారు. కొన్ని చోట్ల కార్యదర్శులు ఎంతో కొంత సొంతంగా ఖర్చు చేస్తున్నారు. అయినా సమస్యలు తీరడం లేదు. పంచాయతీలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తేనే ఏదైనా చేయగలుగుతామని అవేమి లేకుండా పనులు చేయమంటే మేమేలా చేస్తామని అధికారులు వాపోతున్నారు.

జ్వరాలు విజృంభిస్తున్నాయి..

గ్రామాలలో పరిశుభ్రత లేకపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. దీని వలన జ్వరాలు వస్తున్నాయి. కరెంటు బల్బులు లేక చీకట్లో బయటికి వెళ్లాలంటేనే భయమేస్తుంది. డ్రైనేజీలలో మురుగు, వర్షపు నీరు వీధులలో నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుంది.

-జె. రాఘవేంద్ర, నర్సింగాపురం

జీతాలు లేవు

నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. అయినా రోజు వారి పారిశుధ్య పనులు చేస్తున్నాం. జీతాలు లేకపోవడంతో పూట గడవాలంటే ఇబ్బందిగా మారింది. అసలే వర్షాకాలంలో పని తీవ్రత ఎక్కువగా ఉంది. జీతాలు తొందరగా ఇవ్వాలి.

- రాజు, పారిశుధ్య కార్మికుడు

నాగర్‌కర్నూల్‌లో భారీ వర్షం



వర్షానికి జలమయమైన రోడ్లు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 22: జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురువగా ఆదివారం జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లాలో సగటున 16.9 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా జిల్లాలోని పెంట్లవెల్లి మండలంలో 51.4 మిల్లీ మీట ర్ల వర్షం కురువగా పెద్దకొత్తప ల్లిలో 37.4, వెల్దం డలో 34.8, చారకొండలో 28.6, కోడేరులో 26.6, ఉప్పునుంతలలో 26.4, ఊర్కొండలో 24.6, వంగూరులో 21.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని అమ్రాబాదు, పదర మండలాలు మిగతా మండ లాల్లో 0.8 నుంచి 18.4 మిల్లీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. ఆదివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమై డ్రైనేజీలు పొంగిపొర్లాయి. గత పది రోజులుగా మొఖం చాటేసిన వర్షం రెండు రోజులుగా మళ్లీ కురుస్తుండటంతో వాడుముఖం పట్టిన ఆరుతడి పంటలు మళ్లీ జీవం పోసుకున్నారు.



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వాన

ఆత్మరక్షణకు ఆయుధం కరాటే



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సలాంబిన్ ఉమర్

మక్తల్, సెప్టెంబరు 22 : ఆత్మరక్షణకు కరాటే చక్కటి ఆయుధం అని డ్రాగన్ షోటోఖాన్ దూ స్పోర్ట్స్ వ్యవస్థాపకుడు సలాంబిన్ ఉమర్ అన్నారు. ఆదివారం పట్టణంలో కరాటే విద్యార్థులకు వారి ప్రతిభ ఆధారంగా గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఎల్లోబెల్ట్‌లో 100, గ్రీన్ బెల్ట్ 40, ఆరెంజ్ 25, బ్లూ బెల్ట్ 25, మెరున్ బెల్టులు ఐదు, బ్రౌన్ బెల్టులు ఐదుగురికి అందించారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. కరాటేతో పాటు చదువుల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని, సమాజంలో పేరు ప్రతిష్టలు పొందుతారన్నారు. చీఫ్ ఎగ్జామినర్ అంబ్రేష్, అంజన్‌ప్రసాద్, ఎండీ సలీం పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మక్తల్, సెప్టెంబరు 22 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు అందించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఆదివారం వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు గోవిందరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికులు మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం అందించడం లేదన్నారు. ఎన్నికల మెనిఫేస్టోలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ.10 వేల వేతనం అందించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజ న వర్కర్లకు పెంచిన రూ.రెండు వేల వేతనం ఇప్పటి వరకు అందలేదని, వెంటనే అందిం చాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు ప్రమీల, లక్ష్మీ దేవమ్మ, మంగమ్మ, లక్ష్మి, శంకరమ్మ, మహిముద పాల్గొన్నారు.

అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్క రామస్వామి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్క రామస్వామి

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 22: అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేసి రేషనలైజేన్ జీవో నిబంధనలను సవరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్క రామస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన రేషనలైజేషన్ జీవో 25ను వెంటనే సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన అసంబద్ధమైన జీవోలను తీసుకువచ్చి ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పేద బిడ్డల చదువును ఆటంకపరిచే జీవోను వెంటనే సవరించాలని పేర్కొన్నారు. ప్రతీ 20మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని కేటాయిస్తూ తీసుకోవాల్సిందిగా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు గోవర్ధన్, యాదగిరిరావు, మోతిరాం, ప్రభాకర్ రావు, నరసింహులు, సుజాత, పాండయ్య, ఎల్లయ్య, రాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

'శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల డిమాండ్లు పరిష్కరించాలి'

- నిర్వాసితుల సంఘం

జిల్లా అధ్యక్షుడు ఖాజామైనుద్దీన్

పెంట్లవెల్లి, సెప్టెంబరు 22: శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నిర్వాసితుల సం ఘం జిల్లా అధ్యక్షుడు జి. ఖాజామైనుద్దీన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ 42 సంవత్సరాల క్రితం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, ఇళ్లు సర్వస్వం కోల్పోయి ఇప్పటి వరకు కూడా ప్రభుత్వం ఆదుకోలేదని వారు పేర్కొన్నారు. నిర్వాసితులకు అప్పట్లో నామమాత్రపు పరిహారం చెల్లించి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు కూడా ఉద్యోగాలు కల్పించలేదని వారు పేర్కొన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం చొరవ చూపి శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 22 : కదులుతున్న రైలులోంచి ప్రమాదవశాత్తు కిందపడిన ఓ వ్యక్తి మరణించాడు. రైల్వే ఎస్‌ఐ అక్బర్ వివరాల ప్రకారం పాలమూరు సమీపంలోని కోడూరు-కోటకదిర మధ్య రైలు పట్టాలకు సమీపంతో తీవ్ర గాయాలతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మరణించడాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైలు ఎత్తులో ఉండటంతో కిందపడిన వ్యక్తి దొర్లుకుంటూ వెళ్లి పట్టాలకు పది మీటర్ల దూరంలో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మరణించాడు. కాగా ఈ ఘటన శనివారం జరిగి ఉంటుందని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్యూబ్ సాయంతో చెరువు దాటి..

- మోటార్ రిపేరు చేసిన వాటర్‌మన్



ట్యూబ్‌పై చెరువులోకి వెళుతున్న వాటర్‌మన్

అడ్డాకుల, సెప్టెంబరు 22: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో అయిదు రోజులుగా తిమ్మాయిపల్లికి మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటి పైపులైన్లలో సమస్యతో సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొన్నది. గతంలో ఊర చెరువులో ఉన్న బోరు మోటార్‌తో వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా అయ్యేది. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండడంతో బోరు దగ్గరకు వెళ్లడం కష్టంగా మారింది. దీంతో వాటర్‌మన్ పెద్దకురుమయ్య లారీ ట్యూబ్‌ను చిన్నపాటి బోటుగా తయారు చేసుకొని సహాయకునితో బోరు దగ్గరకు వెళ్లి మోటార్‌ను సరిచేశారు. గ్రామానికి తాగునీరు బోరు ద్వారా వచ్చేలా చేశారు. దీంతో తాత్కాలికంగా నీటి సమస్య తీర్చడంతో గ్రామస్థులు వాటర్‌మన్‌ను అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు



వాగులో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రైతులు

మిడ్జిల్, సెప్టెంబరు 22: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి శివారులోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో రైతులు వాగు వద్దకు వెళ్లి ట్రాక్టర్లను ఆదివారం అడ్డుకున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించినా స్పందించకపోవడంతో రైతులపై దౌర్జన్యానికి దిగి ట్రాక్టర్లను అక్కడినుంచి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఇసుక తరలిస్తున్న వారి నుంచి పోలీసులు మామూళ్లు తీసుకోవడంతోనే సకాలంలో స్పందించలేదని పలువురు రైతులు ఆరోపించారు. ఇదే విషయంపై ఎస్పీకి కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైద్య విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబర్ 22 : పట్టణంలోని ఎస్వీఎస్ వైద్యకళాశాల, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారం నాటికి మూడో రోజుకు చేరింది. సెలవు దినం కావడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనకు పోటెత్తారు. కళాశాలలోని 25 విభాగాల పరిధిలో 1,200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అందులో కోల్‌కతా ఘటనకు సంబంధించి రూపొందించిన ప్రదర్శన, అనాటమి విభాగంలో క్రైం సీన్‌పై రూపొందించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇదిలా ఉండగా ఈ సదస్సు ఆదివారం నాటికే చివరి రోజు ఉండగా, ఈనెల 24 వరకు పొడిగించారు. అవకాశాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాపన్‌పల్లి శివారులో పులి సంచారం

- భయాందోళనల్లో గ్రామాల ప్రజలు



అడవిలో అధికారులు ఏర్పాటు చేసిన బోను

దామరగిద్ద, సెప్టెంబరు 22: నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లిలో పులి సంచారంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. రెండు రోజుల క్రితం బాపన్‌పల్లి శివారులో మేకపిల్లను పులి తినేసింది. మేకల కాపరి మేక పిల్ల లేదని వెతికి చూడగా పులి తినేసినట్లు గుర్తించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. బోను ఏర్పాటు చేసి మేకను ఆహారంగా ఉంచారు. బోనుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

పిడుగు పాటుతో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

గోపాల్‌పేట. సెప్టెంబరు 22: వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో ఆదివారం సాయంత్రం పిడుగులతో కూడిన వర్షం పడింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుద్దారం చెందిన గొల్ల నాగేంద్రం గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పిడుగులతో కూడిన వర్షం పడుతుండగా ఎనమిది గొర్రెలు చెట్టు కిందకి వెళ్లాయి. పెద్ద శబ్దంతో చెట్టుపై పిడుగు పడడంతో గొర్రెలు మృతి చెందాయని బాధితుడు వాపోయాడు. గొర్రెల విలువ సమారు రూ.80 వేలు ఉంటుందని తెలిపాడు.

రైతులు ఆర్గానిక్ పంటలు పండించాలి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి



మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

గద్వాల టౌన్, సెప్టెంబరు 22 : వర్మీ కంపోస్ట్ ఎరువుల ద్వారా రైతులు ఆర్గానిక్ పంటల సాగు చేపట్టాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి సూచించారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల పంట ఉత్పత్తులు కలుషితం అవుతున్నాయన్నారు. ఆదివారం పట్టణంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్గానిక్ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారెడ్డి మాట్లాడారు. పశుసంపదను విధిగా పెంచుకోవాలని తద్వారా సేంద్రియ సాగుకు బాటలు వేయాలన్నారు. చిన్న, సన్న, మధ్యకారు రైతులు చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయల పంటల సాగుతో ఆర్థికంగా లాభపడాలన్నారు. దేశంలో వ్యవసాయ రంగానికి జవహర్‌లాల్‌నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దేశం పంట ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. దేశ సరిహద్దుల్లో జవాన్లు చేసే సేవ, దేశంలో కిసాన్‌లు చేసే సేవలు అత్యంత కీలకమన్నారు. బ్రహ్మకుమారి అరుంధతి మాట్లాడుతూ ఆర్గానిక్ పంటల వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందుతాయన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్న రైతులను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో అయ్యపురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, కృష్ణకాంత్, పటేల్ అరుణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల పూజలు



మైసమ్మ ఆలయం వద్ద భక్తులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 22 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి శివారులో వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు పదివేల మందికి పైగా దర్శనం చేసుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి టికెట్ల ద్వారా రూ.34,600, హుండీ ద్వారా రూ.73,437 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు సత్తాచాటాలి

- ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

- అండర్-19 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



హెచ్‌సీఏ అండర్-19 టోర్నీకి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 22: హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు సత్తాచాటాలని సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-19 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలను ఆదివారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు అనేక విజయాలు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. టోర్నీలో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను హెచ్‌సీఏ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు

అబ్దుల్ రఫె, మహ్మద్‌షాదాబ్ అహ్మద్, అభిలాష్‌గౌడ్, హెచ్.రాథోడ్, ముఖిదుద్దీన్, శశాంక్, మనోజ్, రాజు, రామ్‌చరణ్, అభినవ్, కార్తిక్, నగేష్, వివేక్, అంకిత్‌రాయ్, అభినవ్‌తేజ, చరణ్ తేజ్, అర్జున్, సత్యాక్‌రెడ్డి, అర్షద్ అహ్మద్, దినేష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో ఉపాధ్యాయులకు అన్యాయం

-పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 22 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జడ్పీటీసీగా ఉన్న సమయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ తరపున పోటీ చేస్తానని, అప్పట్లో అడిగారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అప్పట్లో మోహన్‌రెడ్డి లాంటి నాయకులు ఎన్నో పోరాటాలు చేసి పంచాయతీరాజ్, టీచర్ల సమస్యల పరిష్కరించడం జరిగిందని గుర్తుచేశారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి వారు కూడా పీఆర్టీయూ సమస్యలు వివరిస్తే వెంటనే పరిష్కరించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చినా కేసీఆర్ ప్రభుత్వం ఏ ఒక్క నాడు కూడా ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోలేదని, గత పదేళ్లలో విద్యారంగం పూర్తిగా భ్రష్టు పట్టిందన్నారు. కనీసం ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టలే దన్నారు. ఎస్‌జీటీ గా నియమకం అయినా ఉపాధ్యాయుడు అదే హోదాలో విరమణ పొందే పరిస్థితికి తెచ్చారన్నారు. కనీసం ఉపాధ్యాయులకు సమయానికి వేతనాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్న కేశవరెడ్డి మాట్లాడుతూ పీఆర్టీయూ ఉపాధ్యాయ సమస్యల పై నిరంతరం పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ విషయంపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. అంతకు ముందు జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్‌రెడ్డి నివేదిక చదివి వినిపించారు. మోహన్‌రెడ్డి, కిషన్, సావిత్రి, బుచ్చారెడ్డి, రాజశేఖర్‌గౌడ్, హరినాథ్, అశ్విని చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో మార్కెటింగ్ సదుపాయం

- తగ్గనున్న దూరా భారం, రవాణా ఖర్చులు

తాడూరు, సెప్టెంబరు 22 : రైతులు పండించిన పంటలు గతంలో మాదిరి కాకుండా, నేరుగా వారే వెళ్లి నచ్చిన ధరకు విక్రయించుకునే సదుపాయాలు ఇటీవల కాలంలో మండలంలో చోటు చేసుకుంటున్నాయి. రైతులు పండించే పత్తి, వడ్లు సమీపంలో ఉండే మిల్లుల వద్దకు వెళ్లి ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పలుకుతున్న ధరలకనుగుణంగా పండించిన పంటను విక్రయించుకునే వెసలుబాటు కలిగింది. ప్రస్తుతం రైతులు పండించే పంటల చుట్టే కొనుగోలు వ్యవస్థలు ఏర్పడటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయి. ఐదు సంవత్సరాల కిందట పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండేవి. రైస్ మిల్లులు, పత్తికి సంబంధించి జిన్నింగ్ మిల్లులు రైతులకు అందుబాటులో లేకపోవడంతో పండించిన పంటలను పట్టణాలైన జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కల్వకుర్తికి తీసుకెళ్లి విక్రయించుకునేవారు. అయితే ఇలా చేయడంతో రైతులకు



ఐతోల్ సమీపంలో ఏర్పాటు చేసిన రైస్ మిల్లు

హమాలీ ఖర్చు, ట్రాన్స్‌పోర్టు వంటివి భారంగా ఉండి ఖర్చు పెరుగుతుండేది. ప్రస్తుతం ఆ పరిస్థితులకు భిన్నంగా మార్కెటింగ్ వ్యవస్థ అన్నదాతల చెంతకే రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండించిన పంటను నేరుగా మిల్లర్ల వద్దనే విక్రయించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం తాడూరు మండల వ్యాప్తంగా పత్తికి సంబంధించి రెండు జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు కాగా.. వరి పంటకు సంబంధించి రైస్‌మిల్లులు దాదాపు ఆరు మిల్లుల వరకు ఉన్నాయి.



యాదిరెడ్డిపల్లి గ్రామసమీపంలో ఏర్పాటు చేసిన పత్తి జిన్నింగ్ మిల్లు

కొనుగోలు వ్యవస్థ మెరుగు పడింది



ప్రస్తుతం పండిస్తున్న వరి పంటకు కొనుగోలు వ్యవస్థలు సమీపంలోనే ఉండడం మూలంగా ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం మండలంలోని దాదాపుగా ఆరు రైస్ మిల్లుల వరకు అందుబాటులోకి రావడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పండించిన ధాన్యాన్ని రైతులు నచ్చిన వ్యక్తులకు విక్రయించుకునే వెసులుబాటు ఉండడం బాగుంది.

- పర్వతాలు, రైతు, సిర్సవాడ

పత్తి మిల్లు ఉండడం చాలా మంచిది



గత రెండు మూడు సంవత్సరాలుగా పండిస్తున్న పత్తికి సమీపంలోనే మిల్లులు అందుబాటులోకి రావడం మూలంగా రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది. అవసరమైన రైతు పొలంలో నుంచి నేరుగా పత్తి మిల్లుకు తరలించి విక్రయించుకునే వెసులుబాటు ప్రస్తుతం ఉంది. ఏదేమైనా మండలంలో ఇప్పటికే రెండు పత్తి మిల్లులు అందుబాటులోకి రావడం మంచిదే.

- శంకర్‌గౌడ్, రైతు, ఎట్టిధార్‌పల్లి

విద్యుదాఘాతంతో వృద్ధుడికి గాయాలు

ఉండవల్లి, సెప్టెంబరు 22: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని మారమునగాల-1 గ్రామంలో విద్యుదాఘాతంతో శతాధిక వృద్ధునికి గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కె.చంద్రయ్య శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన క్రమంలో దారితప్పి ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన ఫెన్సింగ్ లేకపోవడం వలన ఇలాంటి ఘటన జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి



మృతి చెందిన కాడెద్దు

బల్మూరు, సెప్టెంబరు 22 : విద్యుదాఘాతానికి గురై కాడెద్దు మృతి చెందిన ఘటన కొండారెడ్డిపల్లి శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చోటు చేసుకుంది. కొండనాగుల చెందిన రైతు జబ్బు సత్యనారాయణ పొలంలో రెండు కాడెద్దులను మేత కోసం తీసుకెళ్లాడు. ప్రమాదవశాత్తు ఒక కాడెద్దు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో వెళ్లడంతో షాక్‌కు గురై మృతి చెందిందని తెలిపారు. కాడెద్దు విలువ దాదాపు రూ.80వేల వరకు ఉంటుందని రైతు తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు, పశువైద్యాధికారులు స్పందించి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజాపూర్, సెప్టెంబరు 22 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి ఆదివారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని మల్లేపల్లి, ఇద్గాన్‌పల్లిలో ఆదివారం రాత్రి బ్లూకోర్టు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుడంగా కానిస్టేబుల్ సుదర్శన్, రామకృష్ణరెడ్డి ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఇసుకకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్, ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

జడ్చర్ల తహసీల్దార్ సస్పెన్షన్?

జడ్చర్ల, సెప్టెంబరు 22 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం. కార్యాలయంలోని ఓ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్ రికార్డుల అంశంపై స్వయంగా రికార్డులతో వచ్చి వివరించాల్సి ఉండగా అందుకు భిన్నంగా నయాబ్ తహసీల్దార్‌ను పంపించడంపై సీసీఎల్‌ఏ కమిషనర్ ఆగ్రహించి, సస్పెన్షన్ చేసినట్లుగా తెలిసింది. హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా అధికారి తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఐదుగురు తహసీల్దార్‌లు బదిలీ అయ్యారని, సస్పెన్షన్ కాకుంటే బదిలీ జాబితాలో ఉండేదని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

మూసాపేట, సెప్టెంబరు 22 : ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని స్ఫూర్తి తండాలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్ఫూర్తితండాకు చెందిన ముడావత్ పాండు నాయక్(32) ఈనెల 15న కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు విచారించి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



ధ్వంసమైన కారు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 22 : కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వర్షం కురుస్తున్న సమయంలో దేవరకద్ర వైపు నుంచి మహబూబ్‌నగర్ వస్తున్న కారు వన్‌టౌన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతిన్నగా, కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు.

చిన్నారులకు బాల వికాస తరగతులు



శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 22: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారి బాలబాలికలకు ప్రతీ ఆదివారం బాల వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని పాత మార్కెట్ యార్డు శివాలయం ఆవరణలో నిర్వహించిన తరగతుల్లో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు మానవతా విలువలు, దేశభక్తి, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ, ప్రేమ, సేవా తత్వాన్ని గురువుల చేత బోధించారు. కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా సూచించిన విధంగా 6 నుంచి 12 సంవత్సరాల వయస్సు లోపు బాలబాలికలకు వికాస తరగతులు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. మునిసిపాలిటీ పరిధి లోని సత్యసాయి మందిరం, మార్కెట్ యార్డు, గ్లోబల్ స్కూల్, ఎండబెట్ల, ఉయ్యాలవాడ ప్రాంతాల్లో ప్రతీ ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 300 మంది చిన్నారులకు వికాస తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమాజానికి మంచి భావి తరాలను అందించడమే తమ లక్ష్యమన్నారు.

ప్రతీ విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి

- ఏబీవీపీ పాలమూరు యూనివర్సిటీ సెక్రటరీ శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 22 : అడ్మిషన్ పొందిన ప్రతీ విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని ఏబీవీపీ పాలమూరు యూనివర్సిటీ సెక్రటరీ శివకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు యూనివర్సిటీలో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యా ర్థుల పరిస్థితి గందరగోళంగా తయారైందన్నారు. వసతి గృహంలో మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వేణుగోపాల్, శ్రీధర్, ఓం ప్రకాశ్, శ్రీనివాసులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో సీఎంవో బైకాని బాలుయాదవ్, నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 22 : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని సీఎంవో బైకాని బాలుయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పాలమూరు లయిన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ జయంతి సందర్భంగా రెడ్‌క్రాస్ సన్నిధి ఆశ్రమంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన జరిగింది. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన చంద్రకళ, శోభారాణి, శ్రీనివాసులు, మనోరంజని, రాములునాయక్, పవన్‌కుమార్, నరసింహ, కుమార స్వామి, మల్లేష్, సన్నిధి ఆశ్రమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల తన ఉద్యోగ జీవితం కాలంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దుతారన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగితే వారు ఎంతో సంతోషిస్తారని గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ గోపాలకృష్ణ, అధ్యక్షుడు బాలరాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యర్రక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి, ప్రతినిధులు ప్రసాద్, భూమానాగేశ్వర్ , బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి

- భూత్పూర్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



భూత్పూర్ మజీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భూత్పూర్, సెప్టెంబరు 22 : కులమతాలకు అతీతంగా అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని హైదరాబాద్‌కు చెందిన ధార్మిక వక్త ఆలమ్ సయ్యద్ రెహమాన్ అన్నారు. భూత్పూర్‌లోని మదీన మజీద్‌లో ఆదివారం మీలాద్-ఉన్-నబీ వేడుకలను మజీ ద్ కమిటీ అధ్యక్షుడు ఎం.డి. సాధిక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా సయ్యద్ రహమాన్ హాజరై పండుగలను ఉద్దేశించి మాట్లాడారు. మని షి ఎప్పుడూ దేవుని మార్గంలో నడవాలని, ప్రతీ రోజు ఐదుసార్లు నమాజ్ చేయాలని, ఒకరినొకరు గౌరవించుకోవాలని అన్నారు. దేవున్ని ప్రార్థన ద్వారా వేడుకుంటే అన్నీ మంచే జరుగుతాయని ఆయన వివరించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు సాదిక్ మాట్లా డుతూ అన్ని పండుగల సారాంశం ఒక్కటేనని, అందరం భగవంతుని బిడ్డలమేనని, సన్మా ర్గంలో నడిచేవారికి ఏ ఇబ్బందులూ రావని అన్నారు. అంతకు ముందు మదీన మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి మజీద్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ నిర్వాహకులు సాధిక్, మహ్మద్ ఖదీర్, జాంగిర్, హాజి, ఆరీఫ్‌హుస్సేన్, షాఫిక్, సాబేర్, అఫ్సర్, రషీద్, షర్ఫుద్దీన్, అర్షద్, మౌలాలీ, అన్వర్ పాల్గొన్నారు.

టోల్ ప్లాజా పరిసరాల్లో పారిశుధ్య పనులు



అడ్డాకుల టోల్‌ప్లాజా పరిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది

అడ్డాకుల, సెప్టెంబరు 22 : మండల పరిధిలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా దగ్గర ఆదివారం భారత జాతీయ రహదారుల సంస్థ ఆదేశాలతో స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా టోల్‌ప్లాజా సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్డుపైనున్న చెత్తను తొలగించారు. అంతకు ముందు స్వచ్ఛతా హీ సేవ కరపత్రాలను వాహనదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజరు దీపమదియ, ఆపరేషన్ మేనేజరు సంతోష్‌కుమార్, రూట్ ఆఫీసర్ తేజ స్వరూప్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మద్దూరి సురేందర్‌రెడ్డి, రూట్ పెట్రోలింగ్ టీం, టోల్‌ప్లాజా సిబ్బంది, రోడ్ యూజర్స్, యువకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



జడ్చర్లలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

జడ్చర్ల, సెప్టెంబరు 22 : జడ్చర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆచార్యదేవోభవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కైలాష్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకుని తొమ్మిది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను భవిష్యత్ సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ రాంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, మహేంద్ర కుమార్‌రెడ్డి, తెప్ప శ్రీను, విశ్వనాథం, నాగం పాపిరెడ్డి, డాక్టర్ సుజిత్‌కుమార్, బుచ్చయ్య, విఠలయ్య, రవీందర్, మనోహర్, శ్రీకాంత్‌రెడ్డి, రవిశంకర్, దత్తుకుమార్, పాండయ్య పాల్గొన్నారు.

ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి

- దేవీశరన్నవరాత్రి వేడుకలపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 22 : భక్తి శ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు నిర్వహించుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్ భవన్ (దయానంద విద్యా మందిరం)లో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రానున్న దేవీ శరన్నవరాత్రులను ఎంతో వైభవంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. మొన్న ఇటీవల వినాయక చవితి పర్వదినం ఎంతో ఘనంగా నిర్వహించు కున్నామని, అదే స్ఫూర్తితో రానున్న దసరా నవరాత్రులను కూడా జరుపుకుందా మని అన్నారు. ఏ ధార్మిక కార్యక్రమాలలో రాజకీయ ప్రమేయం, జోక్యం లేకుం డా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్సవాలు నిర్వహణ ఖర్చుల నిమిత్తం మునిసిపల్ కౌన్సిల్ నుంచి 3 లక్షల రూపాయలు, తన వంతుగా 50 వేల రూపాయలు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డాక్టర్ మురళీధర్ రావు, రవికుమార్, మోహన్ యాదవ్, కె.రామచంద్రయ్య, బురుజు సుధాకర్‌రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, జి.నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, గౌలి వెంకటేష్, బుట్ట వేద వ్రత్, ముత్యం స్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా మహాసభలు జరగాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి. సాగర్



జడ్చర్లలో సీపీఎం జిల్లా మహాసభల నిర్వహణ సమావేశంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 22 : ప్రజాసమస్యలు ఎజెండాగా, ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేవిధంగా అక్టోబరులో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్ పిలుపునిచ్చారు. జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఆదివారం సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో మహాసభలపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు జడ్చర్ల పట్ట ణంలో పెద్దసంఖ్యలో ఉన్నారన్నారు. వీరి పొట్టగొట్టేవిధంగా పరిస్థితులున్నాయ ని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం అసంపూర్తిగా ఉందన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి సేకరించిన భూములకు భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా, రైతులను మోసం చేశారని ఆరోపించారు. పోలేపల్లి సెజ్‌లోని ఫార్మ పరిశ్రమలలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, స్థానిక నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. వచ్చే నెలలో 26, 27వ తేదీలలో జడ్చర్లలో నిర్వహించే జిల్లా మహాసభల నిర్వహణకు సీపీఎం అనుబంధ ప్రజాసంఘాలు, పార్టీ సానుభూతిపరులు, పార్టీ అభిమానులు సహకరించే విధంగా సమన్వయం చేయాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం జమిలి ఎన్నికల విధానాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నదని, సీపీఎంతో పాటు అఖిలపక్ష పార్టీలు, మేధావులు, సంఘ సంస్కర్తలు, తిరస్కరించేవిధంగా కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. అనంతరం మహాసభలను విజయవంతం చేసేందుకు ఆహ్వాన సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమి టీ అధ్యక్షుడిగా తెలుగు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి దీప్లా నాయక్, కోశాధికా రిగా జగన్‌తో పాటు 25 మంది కార్యకర్తలతో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, నాయకులు వెంకట్‌రాములు, కిల్లె గోపాల్, కురుమూర్తి, పద్మ, చంద్రకాంత్, మోహన్, రాజ్‌కుమార్, లక్ష్మయ్య, ప్రశాంత్, నందు, రాములు, పరశురాం, వెంకటయ్య, యాదయ్య, జయరాములు, లక్ష్మీదేవి, సంధ్య, విజయలక్ష్మి, మణెమ్మ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారులకు అభినందన



పతకాలు సాధించి అథ్లెటిక్స్ క్రీడాకారులతో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఏ.పీ. జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 22 : హైదరాబాద్ ఉస్మానియా యూని వర్సిటీలో ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి 11 పతకాలు సాధించారు. పతకాలు సాధిం చిన వారిలో కార్తీక్, శ్రీధర్, శివ, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రమ్య, శివకుమార్, పూజ, భవి తేజ, హన్షిక ఉన్నారు. వీరిని ఆదివారం ఇండోర్ స్టేడియంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు ఎ.పి.జితేందర్‌రెడ్డి అభినందించారు. అదే విధంగా నెట్‌బాల్ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారా యణరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్పీ. వెంకటేశ్, కురు మూర్తిగౌడ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, కోచ్ సునీల్ పాల్గొన్నారు.

హోరాహోరీగా పీఆర్టీయూ జిల్లా ఎన్నిక

- అధ్యక్షుడిగా మధన్‌మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి






జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 22 : పీఆర్టీయూ టీఎస్ జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో గల ఓమ్ కన్వెషన్ హాల్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. వారం నుంచి రెండు వర్గాలుగా విడిపోయిన నాయకులు సాధారణ ఎన్నికల స్థాయిలో ఓట్ల కోసం ఓటర్ల ఇంటింటికీ తిరిగి ఇరువర్గాల నాయకులు ప్రచారం చేశారు. ఈ ఎన్నికలకు నిజామాబాద్ జిల్లా అధ్య క్షుడు మోహన్‌రెడ్డి తదితరులు ఎన్నికల పరిశీలకు లుగా వచ్చారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగుతున్న నారాయణ్‌గౌడ్, రఘురామ్‌రెడ్డిలు ఓ వర్గంగా పోటీ చేయగా, నూతనంగా పీఆర్టీయూ సీనియర్ మండల నాయకులు మధన్‌మోహన్ యాదవ్, సుధాకర్ రెడ్డి మరో వర్గంగా పోటీ చేశారు. ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా మధన్ మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. మొత్తం జిల్లాలో 109 ఓట్లు ఉండగా అందులో 106 ఓట్లు పోల్ కాగా అధ్యక్ష పదవికి పోటీపడ్డ మధన్‌మోహన్ యాదవ్‌కు 56 ఓట్లు రాగా, ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న నారాయణ్‌గౌడ్‌కు 49 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు చెల్లలేదు. దీంతో 7 ఓట్ల మెజార్టీతో మధన్‌మోహన్ యాదవ్ గెలుపొందా రు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన సుధకార్‌రెడ్డి 69 ఓట్లు రాగా ,ఇప్పటి వరకు జిల్లా ప్రధాన కార్య దర్శిగా ఉన్న రఘురామ్‌రెడ్డికి 36 ఓట్లు వచ్చాయి 33 ఓట్ల మెజార్టీతో సుధాకర్‌రెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్ని కైన అధ్యక్ష , కార్యదర్శులకు ఎన్నికల మోహన్‌రెడ్డి తదితరులు ఎంపిక పత్రం అందజేశారు. ఈ సద ర్భంగా మదన్‌మోహన్ యాదవ్ మద్దతు దారులు సంబురాలు చేసుకున్నారు. నూతన అధ్యక్షులు మదన్ మాట్లాడతు గత పదహారు ఏళ్లుగా మండ ల అధ్యక్షుడిగా ఉంటూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. తనను జిల్లా అధ్యక్షుడిగా, సుధాకర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ప్రతీ కార్యకర్తకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు గట్టు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌గౌడ్, బుచ్చరెడ్డి, అశ్విని చంద్రశేఖర్, సురేష్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోపికాంత్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూ సమాజాన్ని జాగృతం చేయాలి

- విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత ప్రధాన కార్యదర్శి పరాయితం లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 22 : గ్రామ దేవాలయాల ఆధారంగా హిందువులను జాగృతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లా కేంద్రంలో సత్తూర్ రామన్న ధర్మశాల దగ్గర ఉన్న హనుమాన్ దేవాలయంలో పాలమూరు విభాగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాలమూరు ఉమ్మడి జిల్లాల్లో ప్రతీ గ్రామంలో హనుమాన్ దేవాలయాలను కేంద్రంగా చేసుకొని యువకులను సంఘటిత పరిచే కార్యక్ర మంలో భాగంగా బలోపాసన కేంద్రాలను నిర్వహించాలని అన్నారు. నేడు దేశం లో అనేక దుర్ఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా హిందూ యువతను సంఘటిత పరిచే దానిలో భాగంగా ప్రతీ గ్రామంలో ఏదైనా ఒక దేవాలయాన్ని కేంద్రంగా చేసుకొని వారానికి ఒకసారి హనుమాన్ చాలీసా సత్సంగం పేరుతో కలవటం ప్రారంభించాలని అన్నారు. అక్టోబరు రెండో తేదీ నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గావాహిని ఆలయం ద్వారా ప్రతి మండల కేంద్రంలో దుర్గాష్టమి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డుకు సంబంధించిన విషయంలో ఘోరమైన తప్పిదాలు చేశారని, భక్తుల మనోభావాలు దెబ్బతీయడమే కాకుండా స్వామి వారి ప్రసాదాన్ని కూడా అపవిత్రం చేశారని అన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన ఆందోళనలు చేయడానికి కార్యాచరణ రూపొం దిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు తిరుపతి లడ్డు విషయమై సమావేశంలో పాల్గొన్న సభ్యులందరు దేవాలయం ప్రాంగణలోనే నిరసన కార్యక్రమం చేపట్టారు. సమావేశంలో ప్రాంత ఉపాధ్యక్షులు లగిశెట్టి జగదీశ్వర్, ప్రాంత ఉపాధ్యక్షులు చింతల వెంకటరెడ్డి, పాలమూరు జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, విభాగ్ కార్యదర్శి అద్దని నరేంద్ర పాల్గొన్నారు. అంతకుముందు విశ్వహిందూ పరిషత్ ఏర్పడి 60 సంవత్సరాల మహోత్సవాలను పురస్కరించుకొని పరిషత్ సేవలు అందించిన ప్రముఖులకు శాలువాలు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, విభాగ్ అధికారులు రాచర్ల జనార్ధన్, మఠం రాజయ్య, జిల్లా కార్యదర్శి నలిగేసి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న గిరిజన నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 22 : జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన మట్టిగణపతికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన యువత ఏర్పాటు చేసిన మట్టిగణపతికి 21రోజులపాటు ప్రత్యేక పూజలు చేశాక నిమజ్జనం చేస్తామని యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.రవిరాథోడ్ తెలిపారు. పూజల అనంతరం అన్నదానం చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్)నాయకులు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో జె.బాలుమహేంద్ర, కె.శంకర్, డి.లక్ష్మణ్‌నాయక్, డి.రాజు, భూక్యాయాదగిరి, ఆర్.లక్ష్మణ్, సుభాష్, గోపాల్, చంటి, కె.రాములు, ఎం.చందు పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీ కమిటీ అధ్యక్షుడిగా రమేశ్

జడ్చర్ల, సెప్టెంబరు 22 : జడ్చర్ల మునిసిపాలిటీలోని సాయినగర్ కాలనీ నూతన కమిటీ అధ్యక్షుడిగా పాలాది రమేశ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని సకలదేవతల ఆలయంలో ఆదివారం కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలాది రమేశ్, గౌర వాధ్యక్షుడిగా కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులుగా అశోక్‌రెడ్డి, నరేశ్, కోశాధి కారులుగా సతీష్‌కుమార్, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా యాదిరెడ్డి, హర్యా నాయక్, అశోక్, కార్యదర్శిగా కుర్మయ్య, సహాయ కార్యదర్శిగా తారాసిం గ్‌లను ఎన్నుకున్నారు. అలాగే 11 మంది కమిటీ సభ్యులుగా, 8 మందిని సలహాదారులుగా ఎన్నుకున్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

నవాబ్‌పేట, సెప్టెంబరు 22 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో తీసుకువచ్చిన నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబాలను సల్లంగా సూడాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండ ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

నవాబ్‌పేట,సెప్టెంబరు 22: మండలంలో కారుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమావేశమై నాటి తీపి గుర్తులు నెమరు వేసుకున్నారు. నాటి గురువులను పిలిపించి, సన్మానించి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దశరథ నాయక్, రాజుగౌడ్, జగదీష్, సుధాకర్, అశోక్ పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణతోనే ఎరుకలకు న్యాయం

పాలమూరు, సెప్టెంబరు 22 : ఎస్టీల్లో ఏబీసీడీ వర్గీకరణతోనే ఎరుకలకు సమన్యాయం జరుగుతుందని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఎస్టీలో వర్గీకరణ చేపట్టాలని జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ర్యాలీ చేపట్టారు. రాష్ట్రంలోని 10లక్షల ఎరుకల జనాభా ఉన్నా ప్రభుత్వం గుర్తించలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలుకు మార్గం సుగమం అయిందన్నారు. కార్యక్రమంలో కృష్ణ, రమేష్, బి.లక్ష్మమ్మ, జానకమ్మ, లక్ష్మమ్మ, చెన్నయ్య, వెంకటయ్య, భీమయ్య, యాకమ్మ పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన ఎరుకల సంఘం నాయకులు

31 అడుగుల వద్ద కోయిల్‌సాగర్ జలమట్టం

దేవరకద్ర, సెప్టెంబరు 22 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 31 అడుగుల వద్ద నీటి నిల్వలు ఉన్నాయని పాజెక్టుఈఈ ప్రతాప్‌సింగ్ తెలి పారు. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు కోయిలకొండ మం డలం అంకిళ్ల, కొండాపూర్ నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 31 అడుగుల వద్ద నీటి నిల్వ ఉందని తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను ముసివేశారు. రైతులు సాగు చేసుకున్న పంటలకు కుడి, ఎడమ కాల్వ ఆయకట్టు దారులకు నీటిని విడదల చేశారు. రైతులు పండించిన వరి ధాన్యానికి నీట్టిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

పారుతున్న వాగులు

మిడ్జిల్, సెప్టెంబరు 22 : మండలంలోని రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు వాగుల్లో వర్షపు నీరు పారుతోంది. ఆదివారం పలు గ్రామాలకు చెందిన ప్రజలు చేపలు పట్టేం దుకు వాగు వద్దకు వెళ్లినట్లు తెలిపారు. ఆదివారం కావడం తో కొత్తూరు, మున్ననూరు, మిడ్జిల్ గ్రామాల శివారులో ఉ న్న వాగు వద్దకు, చెక్‌డ్యాంల వద్దకు పలువురు వెళ్లినట్లు ప లు గ్రామాలకు చెందిన ప్రజలు తెలిపారు. వాగులో మళ్లీ నీరు పారుతుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న చిన్ననాటి మిత్రులు

రాజాపూర్, సెప్టెంబరు 22 : మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అలియాస్ 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన తనతో పాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుకున్న తన స్నేహితులు సయ్యద్ అలియాస్ కుటుంబ సభ్యులకు రూ. 27వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ రూపాయలను ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అందించి వారి కుటుంబ సభ్యులకు పరామర్శిం చారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ తమ స్నేహితుడి కుటుంబానికి ఆరిక్థసాయంతో తన ప్రియ మైన స్నేహితుడిని కోల్పోవడం బాధాకరమైన విషయమని, స్నేహితులతో గడపిన క్షణాలు మురువలేనివని అన్నారు. కార్యక్రమంలో బాలరాజు, నరేష్ గౌడ్, సాయిరాం, శ్రీశైలం, నర్సింములు, రమేష్, మల్లేష్, శివ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న యువకులు

హన్వాడ, సెప్టెంబరు 22 : మండలంలోని మునిమోక్షం గ్రామ మహాత్మా జ్యోతిపూలే యువజన సంఘం సభ్యులు ఆదివారం గ్రామంలో శ్రమదానం చేశారు. మన ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే మన గ్రామం శుభంగా ఉంటుందని, అందుకే శ్రమదానం చేస్తున్నామని యువజన సంఘం సభ్యులు తెలిపారు. గ్రామ ప్రధాన రహ దారి, ఇళ్లచుట్టూ పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్ర మంలో సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ అధ్యక్షు డు రాజు, సభ్యులు శ్రీనయ్య, కేశవులు, చెన్నయ్య, కృష్ణ, గంగ య్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

విజయవంతమైన వైద్య శిబిరం

నవాబ్‌పేట, సెప్టెంబరు 22 : మండలంలోని లోకిరేవు గ్రామంలో ఆదివారం సత్యసాయి సేవా సమితి వనస్థలిపు రం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆసుపత్రి వైద్యులు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 మంది రోగులకు వివిధ రకాల మందులు అందజేశారు. ఈ సంద ర్భంగా డాక్టర్ సురేందర్ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందన్నారు. పల్లె ప్రజలకు రాబోయే కాలంలో సత్యసాయి సేవా సమితి ద్వారా మరిన్ని వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఉపేందర్ రాణి, నారాయణ, దివ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, సురేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణయ్య గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

గండీడ్, సెప్టెంబరు 22 : నేటి నుంచి 2023-24కు చెందిన సామాజికి తనిఖీకి సంబంధించి గ్రామ సభలను నిర్వ హించనున్నట్లు ఎంపీడీవో దేవన్న, ఏపీవో హరిచంద్రుడు ఒక ప్రకటలో తెలిపారు. నేటి నుంచి ఈ నెల 29వ తేదీ వరకు గ్రామాల్లో డీఆర్‌పీలు తనిఖీ చేసి ఈ నెల 30వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఉమ్మడి మండలంలో 22 గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ కోసం డీఆర్‌పీలు ఆదివారం సాయంత్రం వరకు 22 గ్రామాలకు చేరుకున్నారని ఎంపీడీవో తెలిపారు.